# గ్రామ పంచాయతీలకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



స్పోర్ట్స్ కిట్లను పంచాయతీ కార్యదర్శులకు అందజేస్తున్న డీపీవో తరుణ్‌కుమార్

వికారాబాద్, అక్టోబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టీజీకేపీ స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేయడం సంతోషంగా ఉందని వికారాబాద్ డీపీవో తరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చంద్రకళ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు క్రికెట్ , వాలీబాల్, షటిల్, డంబుల్ తదితర కిట్లను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని నిర్మించిందన్నారు. ఈ క్రీడా ప్రాంగణాలను సమర్ధవంతంగా వినియోగించుకోవడానికి అనుగుణంగా ప్రతి గ్రామానికి స్పోర్ట్స్ కిట్టును అందజేశామన్నారు. ఈ కిట్టు మొత్తం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉంటుందని, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఒక రిజిస్టర్ మేంటెనెన్స్ చేస్తూ రోజు ఆడుకునే వారికి క్రీడా సామగ్రిని అందజేసి మళ్లీ గ్రామ పంచాయతీలోనే ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**దోమ:** క్రీడలను ప్రోత్సహించి యువకులలో నూతన చైతన్యం నింపాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్నదని జడ్పీటీసీ నాగిరెడ్డి, ఎంపీపి అనసూయ అన్నారు. శుక్రవారం దోమ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో క్రికెట్, వాలీబాల్, త్రోబాల్‌తో పాటుగా టీ షర్ట్‌లను అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం,సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీడీవో జయరాం, ఎంపీటీసీ రాములు, సర్పంచ్ రాజూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



దోమలో యువకులకు స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న జడ్పీటీసీ

# ఊరూరా బతుకమ్మ చీరలు పంపిణీ



పరిగి: బతుకమ్మ చీరలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్



నవాబుపేటలో..

పరిగి, అక్టోబర్ 6 : తెలంగాణలో జరుపుకునే బతుకమ్మ పండుగకు ప్రభుత్వం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించిందని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం పరిగి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో మహిళలకు మున్సిపల్ చైర్మ న్ బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్నది సర్కారు ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్ర మం లో కౌన్సిలర్ నాగేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు గౌస్‌పాషా, ఫసియొద్దీన్, ఖలీల్‌పాషా, తఖీ, మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

**కొడంగల్:** బతుకమ్మ వేడుకకు గాను సీఎం కేసీఆర్ ఆడపడచులకు చీర సారెను అందించి గౌరవిస్తున్నట్లు సర్పంచ్‌లు అనితా ఫకీరప్ప, గుండప్ప, ఫకీరప్ప, విజయమ్మ, ఎంపీటీసీ విద్య, మండల కోఆప్షన్ సభ్యుడు ముక్తార్, రైతు సమితి మండల అధ్యక్షుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హస్నాబాద్, పర్సాపూర్, పెద్దనందిగామ, అన్నారం ఆలేడ్ గ్రామాల్లో సర్పంచ్‌లు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మర్పల్లి:** ఆడబిడ్డలకు బతుకమ్మ కానుకగా చీరల పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ లలితా రమేశ్, జడ్పీటీసీ మధుకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు పట్లూర్ గ్రామంలో వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, ఎంపీడీవో రాజమల్లయ్యతో కలిసి మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సోహెల్, ఏపీవో మహేశ్ కుమార్, ఏపీఎం పోచయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, వసంత్ కుమార్, శ్రీని వాస్, గఫార్ తదితరులు పాల్గొన్నారు..

**నవాబుపేట:** బత్తుకమ్మ చీరలను పంపిణీ చేస్తూ ప్రజల దీవెనలు పొందుతున్న సీఎం కేసీఆర్ అని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రావుగారి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డుమెంబర్లు పార్టీ నేతలు ఉన్నారు.



మర్పల్లి: చీరలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ లలితా రమేశ్, జడ్పీటీసీ మధుకర్



కొడంగల్: హస్నాబాద్‌లో ఎంపీటీసీ విద్య ..



పరిగి టౌన్, అక్టోబర్ 6 : పరిగి పట్టణంలో సాయిధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య విగ్రహ ప్రతిష్ట భూమి పూజ శుక్రవారం చేశారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గొర్రెల పెంపకందార్ల జిల్లా డైరెక్టర్ మల్లేశ్, ఉపాధ్యక్షుడు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పంటల పరిశీలన



బొంరాస్‌పేట, అక్టోబర్ 6 : దుద్యాల మం డలంలో రైతులు వానకాలంలో సాగు చేసిన వివిధ రకాల పంటలను జిల్లా వ్యవసా యాధికారి గోపాల్ శుక్రవారం పరిశీలించారు. పొలాలను తిరిగి పత్తి, కంది, వరి పంటలను పరి శీలించి సస్యరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. ముఖ్యంగా పత్తి పంటలో వచ్చే తెగుళ్లు, వాటిని నివా రించడానికి ఎలాంటి మందులు వాడాలో రైతులకు డీఏవో వివరించారు. రైతుల సందే హాలను నివృత్తి చేశారు. ఆయన వెంట ఏఈవో మొహియొద్దీన్, దుద్యాల గ్రామ రైతుబంధు అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

## డీసీసీబీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతన్న పీఏసీఎస్ చైర్మన్లు

తాండూరు, అక్టోబర్ 6: కన్నతల్లిలాంటి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని తాండూరు నియోజకవర్గంలోని పీఏసీఎస్ చైర్మన్లు రవిగౌడ్, వెంకట్రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తాండూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మనోహర్‌రెడ్డి పదవిలో ఉండి చేసిందేమి లేదన్నారు. బీఆర్ఎస్ ఎంతో నమ్మకంతో డీసీసీబీ చైర్మన్ పదవి ఇస్తే కొందరు వ్యక్తుల మాటలు నమ్మి కాంగ్రెస్‌లోకి వెళ్లడం పద్ధతిగా లేదన్నారు. పార్టీకి రాజీనామా చేసిన మనోహర్‌రెడ్డి చైర్మన్ పదవికి కూడా రాజీనామా చేయాలన్నారు. ఎవరు ఎన్ని ఎత్తుగడలు వేసిన తాండూరులో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని గెలిపిస్తామని పేర్కొన్నారు. మోసం చేసే కాంగ్రెస్‌ను, కీడు చేసే బీజేపీని ప్రజలు నమ్మరాదన్నారు.

## విధుల్లో చేరిన అంగన్‌వాడీలు..తెరుచుకున్న కేంద్రాలు



పెద్దేముల్, అక్టోబర్ 6 : అంగన్‌వాడీ టీచర్లు సమ్మె విరమించి శుక్రవారం విధుల్లో చేరారని మంబాపూర్, పెద్దేముల్ అంగన్‌వాడీ సూపర్ వైజర్లు మీనాక్షి, రాణి తెలిపారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు గర్భిణీ, బాలింతలకు, చిన్నారులకు ఆహార పదర్థాలను భోజనాలను అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మీనాక్షి,రాణి మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని 24 రోజులపాటు సమ్మె చేసి ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో గురువారం తాండూరులోని సీడీపీవో కార్యాలయంలో జాయినింగ్ లెటర్లను అందించి శుక్రవారం నుంచి విధుల్లో చేరారన్నారు.

## గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



బంట్వారం, అక్టోబర్ 6 :మండల పరిధిలోని బస్వపూర్ గ్రామంలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనంతో పాటు, రూ 23 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజి పనులను సర్పంచ్ నర్సింహులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు ఖాజా షా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గంచెర్వు మల్లేశం, పార్టీ మండల అధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ



దోమ,అక్టోబర్ 6: తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామ పంచాయతీల పరిపుష్టికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని జడ్పీటీసీ కొప్పుల నాగిరెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో రూ. 20 లక్షల నిధులతో నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి సర్పంచ్ కేశవులు,వైస్ ఎంపీపి మల్లేశంతో కలిసి జడ్పీటీసీ భూమి పూజ చేశారు.

## ప్రాథమిక సహకార సంఘం భవనం ప్రారంభం

కులకచర్ల, అక్టోబర్ 6 : కులకచర్ల మండల కేంద్రంలో నిర్మించిన సహకార సంఘం నూతన భవనంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పీఏసీఎస్ డైరెక్టర్లు ఆధ్వర్యంలో ప్రారంభ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హరికృష్ణ, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు పీరంపల్లి రాజు, చౌడాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మాలె కృష్ణయ్యగౌడ్, రాజప్ప, పీఏసీఎస్ డైరెక్టర్లు పూజలో పాల్గొన్నారు.